
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ కృష్ణా
బుధవారం 1 అక్టోబర్ 2025 పేజీలు 8







- ప్రమాదాలు నివారణ చర్యలలో యాజమాన్యం నిర్లక్ష్యం
- అధికారుల పర్యవేక్షణ శూన్యం
- జరిగిన ప్రమాదాలను గుర్తు చప్పుడు కాకుండా చేస్తున్న యాజమాన్యం
- యాజమాన్య తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కార్మికులు

అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో
# వరుస ప్రమాదాలు

వివరాలు 2లో



## కష్టాల కడలిలోకి...
### అన్నదాతలను నెట్టిన కృష్ణమ్మ

- లంక గ్రామాల్లో ముంపు బారిన పడిన వేలాది ఎకరాలు
- కూరగాయలు, మినుము, పసుపు పైర్లకు భారీ నష్టం

2 లో

## తీరప్రాంతాలలో..
## దశలవారీగా అభివృద్ధి

బందరుకోట, గిలకలదిండిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి కొల్లు రవీంద్ర 7



## నాలా చెఫ్ - వింగ్‌మాన్ ప్రపంచంలోనే తొలి పూర్తి స్థాయి రోబోటిక్ చెఫ్ ప్రారంభం

విజయవాడలో వంటక రంగానికి కొత్త యుగం ప్రారంభం

వివరాలు 2లో



విద్యార్థులను భావి భారత పౌరులుగా చేయటంలో
## టీచర్స్ పాత్ర కీలకం

- విద్యార్ధులను భావి భారత పౌరులుగా చేయటంలో టీచర్స్ పాత్ర కీలకం
- ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా చదివేది పేద పిల్లలే
- మెగా డీఎస్సీలో 50 శాతం ఉద్యోగాలు ఎస్ & ఎస్ పబ్లికేషన్స్ సొంతం
- సింప్లీ సిటింగ్... మంత్లీ టేకింగ్ లా ఉపాధ్యాయులు ఉండకూడదు
- ఒక మంచి ఉపాధ్యాయుడు ఒక తరం భవితవ్యాన్ని మార్చగలడు
- సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థ సారథి

2లో

(మొదటిపేజీ తరువాయి)



## అన్నదాతలను కష్టాల కడలిలోకి నెట్టిన కృష్ణమ్మ

**లంక గ్రామాల్లో ముంపు బారిన పడిన వేలాది ఎకరాలు**

**కూరగాయలు, మినుము, పసుపు పైర్లకు భారీ నష్టం**

**తోట్లవల్లూరు మేజర్ న్యూస్:** ఆరుగాలం చెమటోడ్చి పంటలు పండించే అన్నదాతను కృష్ణమ్మ వరద కష్టాల కడలిలోకి నెట్టివేసింది. నీట మునిగిన పంటలను చూసి రైతులు దిగాలు చెందుతున్నారు. గత సంవత్సరం కూడా కృష్ణానది వరదలో పంటనష్టపోయిన రైతులు ఈ సంవత్సరం అన్నా చేతికి దక్కుతుందనుకున్న పంట దక్కకుండా పోయే ప్రమాదం ఏర్పడింది. వరదకు వాణిజ్య పంటలకు అపార నష్టం వాటిల్లింది. పామర్రు నియోజకవర్గం తోట్లవల్లూరు, పమిడిముక్కల మండలాల పరిధిలోని లంకలలో ఎక్కువ మంది రైతులు పసుపు, కంద, అరటి, బొప్పాయి, తమలపాకు, మినుము, కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి కృష్ణానది వరద కారణంగా తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. కౌలు రైతుల పరిస్థితి మరింత వర్ణనాతీతంగా ఉంది. తోట్లవల్లూరు, పమిడిముక్కల మండలాలలోని లంకలలోని వేల ఎకరాలలో పలురకాల ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. వరద వచ్చి తమను నిండా ముంచేసిందని, తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతన్నలు విజ్ఞప్తి చేస్తున్నారు. వరద ఉధృతంగా ఉన్నప్పటికీ తోట్లవల్లూరు, పమిడిముక్కల మండలాల్లోని లంక గ్రామ ప్రజలు పడవలపై ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. రెవెన్యూ అధికారులు వరద మరింత పెరిగితే ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలలో భాగంగా తోట్లవల్లూరులో ఎన్.డి.ఆర్.ఎఫ్.సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. కాగా లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను ఇప్పటికే అధికారులు పడవలపై సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

## నాలా చెఫ్ - వింగ్‌మాన్ ప్రపంచంలోనే తొలి పూర్తి స్థాయి రోబోటిక్ చెఫ్ ప్రారంభం

**విజయవాడలో వంటక రంగానికి కొత్త యుగం ప్రారంభం**



**విజయవాడ, సెప్టెంబర్ 30 మేజర్ న్యూస్ :** వంటక ప్రపంచంలో విప్లవాత్మక మార్పుకు నాంది పలుకుతూ ప్రపంచంలోనే తొలి పూర్తి స్థాయి ఆటోమేటెడ్ రోబోటిక్ చెఫ్ "నాలా చెఫ్ – వింగ్‌మాన్" విజయవాడ ఎక్స్‌పోలో ఆవిష్కృతమైంది. ఈ స్టాల్‌ను ఎంపీ కేశినేని శివనాథ్ తో కలిసి కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. నాలా రోబోటిక్స్ ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్త అనిల్ సుంకర నేతృత్వంలో రూపొందిన ఈ రోబోటిక్ చెఫ్, వంటల్లో కచ్చితత్వం, పరిశుభ్రత, వేగంగా తయారుచేసి ఇవ్వడంలో నిర్వచనం ఇవ్వనుంది. ఈ రోబోట్ సంపూర్ణ ఆటోమేషన్‌తో, ఎలాంటి మానవ జోక్యం లేకుండా రుచికరంగా వంటకాలను కూడా అత్యంత కచ్చితంగా తయారు చేయగలదు. విజయవాడలో ఆరంభమైన నాలా చెఫ్ – వింగ్‌మాన్, భవిష్యత్ స్మార్ట్ కిచెన్స్‌కు కొత్త ప్రమాణాలను సృష్టిస్తూ, ప్రపంచవ్యాప్తంగా రెస్టారెంట్లు, ఫుడ్‌కోర్టులు, క్లౌడ్ కిచెన్స్‌కి మార్గదర్శిగా నిలవనుంది. ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్ర పౌర విమానాయనశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, "భారతదేశంలో తయారీ, ఆవిష్కరణలు ప్రపంచాన్ని ముందుకు నడిపే స్థాయికి చేరుకుంటున్నాయి. నాలా చెఫ్ దానికి ఒక ఉదాహరణ. ఇది టెక్నాలజీ ఆధారిత కొత్త వ్యాపార అవకాశాలకు మార్గం సుగమం చేస్తుంది" అని అభినందించారు. అనిల్ సుంకర మాట్లాడుతూ "నాలా చెఫ్ ఒక ఉత్పత్తి మాత్రమే కాదు.. ఇది భవిష్యత్తు వంటకాల సాంకేతికత. విజయవాడ నుంచే భారతీయ ఆవిష్కరణను ప్రపంచానికి పరిచయం చేసి, గ్లోబల్ కిచెన్స్‌కి కొత్త నిర్వచనం ఇవ్వాలన్నదే మా లక్ష్యం" అన్నారు.

# అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో వరుస ప్రమాదాలు

**ప్రమాదాలు నివారణ చర్యలలో యాజమాన్యం నిర్లక్ష్యం**

**అధికారుల పర్యవేక్షణ శూన్యం**

**జరిగిన ప్రమాదాలను గుర్తు చప్పుడు కాకుండా చేస్తున్న యాజమాన్యం**

**యాజమాన్య తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కార్మికులు**




**జగ్గయ్యపేట మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామంలో ఉన్న అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో బాయిలర్ లో జరిగిన ప్రమాదం వలన నలుగురు కార్మికులకు గాయాలు జరిగినట్లుగా సమాచారం. జరిగిన ప్రమాదాన్ని గుట్టు చప్పుడు కాకుండా యాజమాన్యం ప్రయత్నం చేసి క్షతగాత్రులను అంతర్గత ప్రదేశాలలో గోప్యంగా ఉంచి చికిత్స అందస్తున్నట్లుగా తెలుస్తుంది. క్షతగాత్రులు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కావడంతో విషయం కాస్త బయటకు రాకుండా ఉంచటం జరిగింది. ప్రస్తుతం బాయిలర్ మరమ్మతుల పనులు జరగటం వలన ప్రమాదం కాస్త తక్కువ మోతాదులో జరిగినట్లుగా వినికిడి. పని జరిగే సమయాలలో ఇటువంటి ప్రమాదం జరిగినట్లయితే భారీ స్థాయిలోనే ప్రాణనష్టం తో పాటు ఆర్థిక నష్టం జరిగేదని కార్మికుల నుండి తెలుస్తుంది. గత సంవత్సరంలో ఇలాంటి ప్రమాదంలో ఎంతోమంది కార్మికులు బలి అయిపోయారు. ఆ ప్రమాదాన్ని కార్మికులు మరవక ముందే మరో ప్రమాదం జరగడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాల నివారణ చర్యలలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వారు తెలుపుతున్నారు. అలాగే ప్రభుత్వ అధికారులు కూడా ప్రమాదాలు జరిగిన తర్వాత హడావుడి చేసే కన్నా ముందస్తు ప్రమాద నివారణ చర్యలు చేపడితే బాగుంటుందని వారు వాపోతున్నారు. క్షతగాత్రులు ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు కావడంతో యాజమాన్యం వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వారు తెలుపుతున్నారు. కనుక ఇప్పటికైనా సంబంధిత జిల్లా స్థానిక అధికారులు స్పందించి వరుసగా జరుగుతున్న ప్రమాదాల పట్ల సమగ్ర విచారణ జరిపించి కంపెనీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# విద్యార్థులను భావి భారత పౌరులుగా చేయటంలో టీచర్స్ పాత్ర కీలకం

**ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా చదివేది పేద పిల్లలే**

**మెగా డీఎస్సీలో 50 శాతం ఉద్యోగాలు ఎస్ & ఎస్ పబ్లికేషన్స్ సొంతం**

**సింప్లీ సిటింగ్... మంత్లీ టేకింగ్ లా ఉపాధ్యాయులు ఉండకూడదు**

**ఒక మంచి ఉపాధ్యాయుడు ఒక తరం భవితవ్యాన్ని మార్చగలడు**

**సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్ధ సారధి**




**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** సమాజంలో ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్ధసారధి చెప్పారు. మంగళవారం నగరంలోని ఎస్ ఎస్ కన్వెన్షన్ హాలులో ఎస్ %ఒ% ఎస్ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ-2025 సక్సెస్ మీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ విజయోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మంత్రి కొలుసు పార్ధసారధి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్ధసారధి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో డీఎస్సీ అంటే అందని ద్రాక్ష పండులా ఉండేదని దానిని అందేలా చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు దక్కుతుందన్నారు. మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో 16 వేల టీచర్ పోస్టులను సకాలంలో పారదర్శకంగా భర్తీ చేశారన్నారు. ఇందులో ఎక్కువగా ఎంపికైన వారు పేద కుటుంబాల నుంచి వచ్చిన వారై ఉంటారని నేను భావిస్తున్నానన్నారు. డీఎస్సీ లో ఉద్యోగం సాధించిన వారు ఎంతో బాధ్యతాయుతంగా ప్రభుత్వ స్కూల్స్ కు వచ్చే పేద విద్యార్థుల పిల్లలకు గుర్తుండే విధంగా విద్యా బుద్దులు నేర్పించాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు.. స్కూల్లో పాఠాలు నేర్పించడం ఎంతో కష్ట సాధ్యమైన విషయం అని పాఠాలు చెప్పే వ్యక్తి కంటే విద్యార్థుల బ్రెయిన్స్ పది రెట్లు ఎక్కువుగా పనిచేస్తామని తెలిపారు. అలాంటి పిల్లలను సక్రమమైన దారిలో పెట్టి విద్యాబుద్దులు నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. స్వర్ణాంధ్ర 2047 కు ప్రపంచంలో భారతదేశం నెంబర్ వన్ లాగా ఉండేలాగా విద్యార్థులను టీచర్ లు సన్నద్ధం చేయాలని పేర్కొన్నారు. ఒకప్పుడు టీచర్ లు అంటే ఒక విధమైన భయం, గౌరవం ఉండేదని నేడు టీచర్ లు అంటే పరిస్థితి ఎలా ఉందో మనందరం చూస్తూనే ఉన్నామన్నారు. ఉపాధ్యాయ వృత్తి పట్ల ఉన్న గౌరవం విద్యార్థుల్లో కొంత తగ్గిందని, ఇది సమాజానికి ఆరోగ్యకరం కాదన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందని తెలిపారు. ఎప్పుడైతే ఉపాధ్యాయులు తమ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా, సేవగా భావించి అంకితభావంతో పనిచేస్తారో అప్పుడే విద్యార్థులు వారిని ఎంతో గౌరవిస్తారన్నారు. ఆలా కాకుండా సింప్లి సిటింగ్ అండ్ మంత్లీ టేకింగ్ లా ఉంటే వారికి సమాజంలో అంత గౌరవం ఉండదని తెలిపారు. నేడు ప్రభుత్వ పాఠశాలల్లో 95 శాతం పేదవర్గాల పిల్లలే చదువుకుంటున్నారని అన్నారు. ఆ పిల్లల భవిష్యత్తు వారి తల్లితండులను కూడా తెలియదని వారికి తెలిసిందల్లా మా పిల్లవాడు బాగా చదువుకుని పట్టణంలో మంచి ఉద్యోగం చేసుకోవాలని ఆశిస్తారన్నారు. ఒకప్పుడు తమ పిల్లలు ఇంజినీర్లు, డాక్టర్లు కావాలని తల్లిదండ్రులు కోరుకునేవారని, ఇప్పుడు ఐఏఎస్, ఐపిఎస్ కావాలని కోరుకుంటున్నారన్నారు. స్కూల్ దశలోనే విద్యార్థులకు మంచి పునాది వేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తుందని అందుకు నిదర్శనం మంత్రి నారా లోకేష్ విద్యా శాఖ మంత్రిగా బాధ్యతలు ఎన్నుకోవడమే అని తెలుసుకోవాలన్నారు. సూపర్ 6 లో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మెగా డీఎస్సీ పై మొదటి సంతకం పెట్టారన్నారు. మెగా డీఎస్సీ పూర్తి కాకుండా ఋషులు యజ్ఞాలు చేస్తుంటే రాక్షసులు ఆ యజ్ఞాలను పాడుచేసే విధంగా డీఎస్సీ పూర్తి కాకుండా ఉండడానికి ఎన్నో కేసులు వేశారన్నారు. అయినా మంత్రి నారా లోకేష్ అనుకున్న విధంగా మెగా డీఎస్సీని పూర్తి చేయడం గొప్ప విషయం అన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రతీ పిల్లవాడు చదువుకోవాలని ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో 67 లక్షల మంది పిల్లలకు తల్లికి వందనం అందించారన్నారు. గతంలో ఇంటికి ఒకరికి ఇస్తే నేడు ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటుంటే అంత మంది పిల్లలకు అందించిన ఘనత ముఖ్యమంత్రి కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో చదువుకుంటున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు పెట్టుబడిదారులకు రాష్ట్రంలో అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. అమరావతి నగరాన్ని అమెరికాలో సిలికాన్ వ్యాలీ లాగా క్వాంటం వ్యాలీ లా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు బాధ్యత తీసుకుని విద్యార్థులకు పాఠాలు నేర్పించటంలో సఫలీకఈతం కావాలని కోరారు. మెగా డీఎస్సీలో 50 శాతం ఉద్యోగాలు సాధించడంలో ఎస్ %ఒ% ఎస్ పబ్లికేషన్స్ కృషి అనితర సాధ్యం అన్నారు. లాభా పేక్ష లేకుండా ఈ సంస్థను నిర్వహించడం చాలా గొప్పవిషయం అని మంత్రి కొలుసు పార్ధసారధి తెలియజేసారు. ఎస్ %ఒ% ఎస్ పబ్లికేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ మాకం శేషావలి మాట్లాడుతూ రాష్ట్రంలో మెగా డీఎస్సీ లో 50 శాతం కంటే పైన ఉద్యోగాలు సాధించడం మా సంస్థ పురోభివృద్ధికి నిదర్శనం అన్నారు. అంతే కాకుండా మా సంస్థ నుంచి రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం మా సంస్థకు గర్వకారణం అని తెలిపారు. ఎన్నో రాష్ట్రస్థాయి ర్యాంకు లను స్వంతం చేసుకుని మా సంస్థ గౌరవాన్ని ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు కాపాడారన్నారు. మెగా డీఎస్సీలో రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు పొందిన శ్రీకాకుళం జిల్లా కు చెందిన శేషాద్రి నాయుడు, విత్తనాల వంశీ కృష్ణ లకు రూ. 50,000 చెక్ లను మంత్రి పార్ధసారధి అందించారు. అదేవిధంగా ఎస్ %ఒ% ఎస్ పబ్లికేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ మాకం శేషావలి కుటుంబాన్ని మంత్రి పార్ధసారధి సత్కరించారు. కార్యక్రమంలో లో మాజీ శాసనమండలి సభ్యులు కె. లక్ష్మణ రావు, కే. శ్రీనివాస్, ఐపీఎస్, సైకాలజిస్ట్ నాగేశ్వరరావు, అంగలూరు డైట్ కాలేజ్ మాజీ ప్రిన్సిపాల్ ఎన్వీజీ ఆంజనేయులు, మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిని ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



# బందరు రైల్వే ప్రయాణికుల ఇబ్బందులు పరిష్కరించాలి

**జిల్లా ముఖ్య కేంద్రం మచిలీపట్నం రైల్వే స్టేషన్ వసతుల లేమితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు**

**మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకి శెట్టి బాలాజీ డిమాండ్**





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సుదీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న మచిలీపట్నం రైల్వే ప్రయాణికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ డిమాండ్ చేశారు. మంగళవారం మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ముఖ్య కేంద్రం మచిలీపట్నం రైల్వే స్టేషన్ వసతుల లేమితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బాలాజీ అన్నారు. గత రెండు సంవత్సరాలుగా మచిలీపట్నం రైల్వే స్టేషన్ లో లిఫ్ట్ సదుపాయం లేకపోవడం వలన వృద్ధులు మహిళలు లగేజితో ఉన్న ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో ఎంపీ బాల సౌరి తన నిధులనుండి 50 లక్షలు లిఫ్ట్ కోసం ప్రకటించిన నేటికీ అది కార్యరూపం దాల్చకపోవడం బాధాకరమని బాలాజీ అన్నారు. విశాఖపట్నం ప్రయాణికుల కష్టాలు వెళ్లే వారికి, వచ్చే వారికి ఎక్కువగా ఉన్నాయని బాలాజీ అన్నారు. విశాఖపట్నం నుండి మచిలీపట్నం వచ్చే రైలును ప్రతి రోజు గుడివాడలో గంటకు పైగా నిలిపివేయటం ఎంతవరకు సమంజసం అని బాలాజీ ప్రశ్నించారు. మచిపట్నంలో ఒకటవ ప్లాట్ఫారం ఖాళీగా ఉన్న దానిని ఉపయోగించుకోకుండా వైజాగ్ ట్రైన్ మూడో నెంబర్ లో ఆపడం వలన ప్రయాణికులు మెట్లు ఎక్కటం దిగడం చేయలేక రైల్ ట్రాక్ మీద అడ్డంగా బయటకు వస్తున్నారని బాలాజీ అన్నారు. అర్ధరాత్రి పూట వచ్చే రైలులో పోలీస్ పహార లేకపోవడం వల్ల ప్రయాణికులు మహిళలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని బాలాజీ అన్నారు. మచిలీపట్నం నుండి తిరుపతి కు ప్రతిరోజు ఉండే రైలును ఎంతో రద్దీగా ఉన్నా సరే రద్దు పరచటం హిందువుల, రైల్వే ప్రయాణికుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని బాలాజీ ఆరోపించారు. మచిలీపట్నం తిరుపతి రైలు నాలుగు నియోజకవర్గ ప్రజలకు ఎంతో అందుబాటులో ఉండే ట్రైన్ అని బాలాజీ అన్నారు. మచిలీపట్నం నుండి ముంబై కు ట్రైన్ ఎంతోకాలంగా మంజూరు కాకుండా పెండింగ్ లో ఉందని ముంబై ట్రైన్ కోసం ఎంపీ బాలసోరి రైల్వే మంత్రి తో మాట్లాడి కృషి చేయాలని బాలాజీ సూచించారు. పెరుగుతున్న రద్దీ దృష్ట్యా మచిలీపట్నం నుండి విజయవాడకు ప్రతి రెండు గంటలకు టూ స్టాప్ రైలు ఏర్పాటు చేసి రైల్వే ప్రయాణికులకు వెసులుబాటు కల్పించాలని బాలాజీ సూచించారు. కోట్లు ఖర్చుపెట్టి డబుల్ ట్రాక్ వేసిన రైళ్లను నిలిపివేయటం అధికారుల నిర్లక్ష్యంగా ఉందని బాలాజీ అన్నారు. మచిలీపట్నం రైల్వే స్టేషన్ లో క్యాంటీన్ సదుపాయం ఏర్పాటు చేయాలని బాలాజీ డిమాండ్ చేశారు.

# రాష్ట్ర చరిత్రలోనే తొలి ఘన సన్మానం..





**జగ్గయ్యపేట,సెప్టెంబర్ 30, మేజర్ న్యూస్ :** డీఎస్సీ 2025 లో విజయం సాధించిన 75 మంది అభ్యర్థులకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ఘనంగా సత్కరించారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో డీఎస్సీ-2025లో ఉపాధ్యాయులుగా, భాషా పండితులుగా, ఫిజికల్ డైరెక్టర్లుగా ఎంపికైన 75 మంది అభ్యర్థులను తొలిసారిగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఆధ్వర్యంలో వారి నివాసంలో నిర్వహించారు. కార్యక్రమం ఉదయం కొత్తగా ఎన్నికైన టీచర్లతో అల్పాహారంతో ప్రారంభమైంది.

అనంతరం సభలో కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులు తమ అనుభవాలు, కష్టాలు, ప్రయాణాన్ని పంచుకున్నారు. తరువాత ప్రతి అభ్యర్థిని సభలో పిలిచి, శాసనసభ్యులు, ఆయన సతీమణి శ్రీరాం శ్రీదేవి అమ్మాజీ నుదుటి తిలకం దిద్ది, దంపతులిద్దరూ దుశ్శాలతో సత్క రించారు. అదనంగా మహిళా అభ్యర్థులకు చీరలు, పురుషులకు షర్ట్-ప్యాంట్లు అందజేశారు. జీవితాంతం గుర్తుండే గుర్తింపుగా సర్వీస్ రిజిస్టర్ కూడా అందిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ అన్ని వృత్తులలో నాకు అత్యంత ఇష్టమైనది ఉపాధ్యాయ వృత్తి. ఒక ఉపాధ్యాయుడు సమాజాన్ని తీర్చిదిద్దగలడు. విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చగలడు. నా నియోజకవర్గంలో 75 మంది కొత్త ఉపాధ్యాయులు ఎంపిక కావడం పూర్వజన్మ సుకృతం. మీరు అందరూ ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలిచి, విద్యార్థులకు వెలుగునిచ్చే మార్గదర్శకులుగా నిలవాలని కోరుకుంటున్నాను అని అన్నారు. అలాగే ఈ సందర్భంలో ఉపాధ్యాయులు మాట్లాడుతూ మెగా డియ స్సీ అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి హృదయపూర్వక శుభాకాంక్షలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము అని పేర్కొన్నారు.



## ప్రశాంత దర్శనం... భక్తుల సంతోషం..

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 30, మేజర్ న్యూస్ :** శరన్నవరాత్రి దసరా మహోత్సవాలలో తొమ్మిదో రోజు మంగళవారం అమ్మలగన్నయమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ జగన్మాత శ్రీ దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఇంద్రకీలాద్రి ఆలయ అధికారులు, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ, నగర పాలక సంస్థ... ఇతర శాఖల సమన్వయంతో చక్కగా పనిచేస్తుండడంతో ప్రతిఒక్కరూ ఆహ్లాదకర దర్శన భాగ్యం పొందుతున్నారు. భక్తుల రాకతో దేవస్థానం పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో అలారారుతున్నాయి.

## ఆర్థిక సహాయం అందజేత




**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** మండలంలోని చీమలపాడు గ్రామంలో షేక్ దాదు సాహెబ్ అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని కుటుంబానికి గ్రామ టిడిపి నాయకులు పరా మర్శించారు. ఈ సందర్భంగా చీమలపాడు పిఎసిఎస్ సహకార సంఘం లో సభ్యులుగా ఉన్నందున పదివేల రూపాయలు మట్టి ఖర్చుల నిమిత్తం మృతుని కుటుంబానికి టిడిపి నాయకులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపిఅధ్యక్షులు భరోతు పీక్లా నాయక్, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు కొండపాటి సుబ్బారావు, టిడిపి గ్రామ సెక్రెటరీ జంగా స్టాలిన్, పిఎసిఎస్ అధ్యక్షులు బెజవాడ శంకర్, షేక్ ఆదామ్ షరీఫ్, బెజవాడ ఆదిశేషు షేక్ కరిముల్లా పలువురు పాల్గొన్నారు.

## శ్రీ కనకదుర్గా దేవిగా దర్శనమిచ్చిన కొండలమ్మ



**గుడ్లవల్లేరు సెప్టెంబరు 30 మేజర్ న్యూస్ :** దసరా నవరాత్రుల్లో భాగంగా మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ తల్లి, అంగలూరు శ్రీ జ్ఞానసాయి మందిరంలో అమ్మవారు, కౌతవరం శ్రీ గంగా పార్వతీ సమేత గౌతమేశ్వరాలయంలో అమ్మవారు కనకదుర్గా దేవిగాను, డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వరుని ఆలయంలో అమ్మవారు శ్రీ వరలక్ష్మీ దేవిగాను మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. విశేషాభిషేకాలను అందుకున్న అమ్మవార్లను భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.




## సామ్సంగ్ గెలాక్సీ వేరబుల్స్‌పై అద్భుతమైన పండుగ డీల్స్

**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశపు అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్సంగ్, తన తాజా గెలాక్సీ వేరబుల్స్‌పై, గెలాక్సీ వాచ్8 సిరీస్. గెలాక్సీ బడ్స్3 ఎఫ్ఈతో సహా, మునుపెన్నడూ చూడని ధరలను ప్రకటించింది. పండుగ సీజన్‌కు ముందు భారీ డిస్కౌంట్‌లను పొందే ఇతర ఉత్పత్తుల్లో గెలాక్సీ వాచ్ అల్ట్రా, గెలాక్సీ రింగ్ కూడా ఉన్నాయి. ఈ ప్రత్యేక డిస్కౌంట్‌లు కస్టమర్‌లకు గెలాక్సీ వేరబుల్స్‌ను వాటి లాంచ్ నుండి అత్యంత ఆకర్షణీయమైన ధరలకు సొంతం చేసుకోవడానికి ఒక అద్భుతమైన అవకాశాన్ని అందిస్తాయి.

## కాలిఫోర్నియా బాదంతో వరల్డ్ హార్ట్ డేను జరుపుకోండి




**విజయవాడ మేజర్ న్యూస్ :** ఈ సంవత్సరం, ప్రపంచ హృదయ దినోత్సవం 'డోంట్ మిస్ ఎ బీట్' అనే థీమ్‌తో ముడిపడి ఉంది. ఈ నేపథ్యంలో, పోషకాహార, వెల్నెస్ కన్సల్టెంట్, షీలాకృష్ణస్వామి గుండె ఆరోగ్యానికి సంబంధించి కొన్ని సూచనలు చేశారు. ఆరోగ్యకరమైన అలవాట్లను అలవరచుకోవాలని ఆమె పేర్కొన్నారు. రోజువారీ ఆహారంలో కాలిఫోర్నియా బాదంను చేర్చుకోవాలని సిఫారసు చేశారు '200 కు పైగా ప్రచురించబడిన అధ్యయనాలు కాలిఫోర్నియా బాదం అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని చూపించాయి. అవి గుండె ఆరోగ్యకరమైన మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు, విటమిన్ ఇ, మెగ్నీషియం, పొటాషియం, డైటరీ ఫైబర్‌తో సహా 15 అవసరమైన పోషకాలను అందిస్తాయి. బాదంను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మొత్తం కొలెస్ట్రాల్, చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుందని, అలాగే గుండె జబ్బులతో సంబంధం ఉన్న ఇన్‌ఫ్లమేషన్ మార్కర్లను కూడా తగ్గిస్తుందని శాస్త్రీయంగా నిరూపించబడింది' అని పేర్కొన్నారు. బాదంతో నిరంతర శక్తి లభించి, మొత్తం ఆరోగ్యాన్ని బాదం మెరుగుపరుస్తుందని ఆమె వెల్లడించారు.

## డైరెక్టర్ పార్వతీకు సన్మానం



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** మండలంలోని కొత్త రేపుడి గ్రామములో విజయవాడ కనకదుర్గ అమ్మ వారి గుడి నూతన పాలకమండలిలో డైరెక్టర్‌గా తరిగొప్పల పార్వతిని నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తరిగొప్పల హుస్సేన్ సతీమణి తరిగొప్పలపార్వతికు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## కోడూరు 9 నెంబర్ పంట కాలవలో మృతదేహం లభ్యం



**కోడూరు మేజర్ న్యూస్ :** కోడూరు భారతీయ స్టేట్ బ్యాంక్ సభ్యత్వంలోని 11 వ నెంబరు పంట కాలువలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో మృతదేహం తేలుతూ కనిపించింది. స్థానికంగా ఉన్న ప్రజలు ఖాత చెందుతూ భయభ్రాంతులకు లోనయ్యారు. మృతుడు సమీపంలోని కాపులు కాలనీకి చెందిన అర్జున్ రావు(60)గా గుర్తించారు. కోడూరు నుండి ఉల్లిపాలెం వైపు వెళ్లే పంట కాలువలో ఈ ఘటన జరిగింది. మృతుడి ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కోడూరు పోలీసులు ప్రమాదానికి గల కారణాలు దర్యాప్తు చేపట్టారు.



## అమ్మవారి విగ్రహ కమిటీకి లంక లితీష్ విరాళం

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరంలోని దేవుని చెరువులోని 10వ రోడ్డులో నవరాత్రుల సందర్భంగా ఏర్పాటుచేసిన అమ్మవారి పూజా కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు లంక లితీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొని, ఆ అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, మైలవరం నియోజకవర్గం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ స్ఫూర్తితో విగ్రహ కమిటీ సభ్యులకు తన వంతు సహాయంగా రూ.5000లు అందజేశారుఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల పార్టీ సెక్రటరీ దూరు బాలకృష్ణ, టౌన్ బీసీల అధ్యక్షుడు అట్ల తిరుపతిరావు, టౌన్ యూత్ సభ్యుడు సుదీప్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గుదలపై ప్రజలకు అవగాహన



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** ఎన్డీఏ ప్రభుత్వం జిఎస్టి తగ్గించడం ద్వారా పేదలకు, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీర్ల సీతారామరాజు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం అందించిన కరపత్రాలను గ్రామాల్లో పం పిణీ చేస్తూ ప్రజలకు జీఎస్టీ పై అవగాహనను అధికారులు కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని మంటాడ గ్రామంలో అధికారుల బృందం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తూ జీఎస్టీ తగ్గించడంపై అవగాహనను కల్పించారు. జీఎస్టీ తగ్గించడం వల్ల ఒక్కొక్క కుటుంబానికి సంవత్సరానికి 15 వేల రూపాయల వరకు ఆదా అవుతుందని, వ్యాపారులకు కూడా అమ్మకాలు పెరిగి లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సూపర్ గిఫ్ట్ ఇచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం అంటూ కరపత్రాలను ప్రభుత్వం అందించింది. వీటిని అధికారులు గ్రామాల్లో పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సీతారామరాజుతో పాటు మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి గోలి రామకృష్ణ, మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే వసంత



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** నూతన వధూవరులను మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆశీర్వదించారు. కొండపల్లి మున్సిపాలిటీ 24వ వార్డు కౌన్సిలర్ పులి అరుణకుమారి కుమార్తె రాజీవిని రసజ్ఞ, సిద్ధు వివాహ రిసెప్షన్ ఇబ్రహీంపట్నంలోని ఎం.వి.ఆర్ కళ్యాణమండపంలో మంగళవారం జరిగింది. ఈ వివాహ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు, కూటమి నేతలు నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆటోమొబైల్ రంగంలో శిక్షణ



**జగ్గయ్యపేట మేజర్ న్యూస్ :** పట్టణ సమీపంలో ఉన్న ఆటోనగర్‌లోని టాటా సర్వీ స్ సెంటర్, హ్యుందాయ్ సేల్స్, సర్వీస్ షోరూమ్‌లలో మండలంలోని షేర్ మహమ్మద్ పేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు పరిశ్రమ ఇంటర్న్‌షిప్ శిక్షణ పొందుతున్నారు. ఈ శిక్షణలో విద్యార్థులు ఆటోమొబైల్ పరిశ్రమకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం అలవర్చుకుని, భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పొందే అవకాశం కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ శిక్షణను ఆటోమొబైల్ వృత్తి ఉపాధ్యాయుడు గుడివాడ భాను తేజ పర్యవేక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.వాణి మంగళవారం శిక్షణా కేంద్రాన్ని సందర్శించి ఈ కార్యక్రమాన్ని అభినందించారు. అలాగే ఎన్టీఆర్ జిల్లా వృత్తి సమన్వయాధికారి వెంకట్ కూడా సందర్శించి, శిక్షణను పరిశీలించి విద్యార్థుల కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన టాటా సర్వీస్ మేనేజర్ కల్యాణ్, హ్యుందాయ్ మేనేజర్ చందులకు ధన్యవాదాలు తెలిపారు.

# కనక దుర్గాదేవి అలంకారంతో దర్శనమిచ్చిన అమ్మవార్లు











**పామర్రు మేజర్ న్యూస్ :** దేవి శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు అయిన మంగళవారం మండలంలోని పలు గ్రామాలలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అయ్యా దేవాలయాలలో అమ్మవార్లకు శ్రీ కనక దుర్గాదేవి అలంకారం చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు విచ్చేసి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన పామర్రులోని శ్రీ అంకమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని శ్రీ కనకదుర్గా దేవిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని లలితా సహస్రనామ పారాయణం చేశారు. స్థానిక బుచ్చమ్మ ఆశ్రమంలో, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవార్లను శ్రీ కనక దుర్గాదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముక్తేవి గౌతమ్ మాధవ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం మహిళలతో కుంకుమ పూజ చేయించారు. మహిళలు పెద్ద సంఖ్యలో కుంకుమ పూజ కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే స్థానిక శివాలయంలో అమ్మవారికి శ్రీ కనకదుర్గాదేవి అలంకారం చేయగా భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# నగరాల సీతారామస్వామి, శ్రీ మహాలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్న టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి పెందుర్తి శ్రీనివాస్ దంపతులు





**విజయవాడ మేజర్ న్యూస్ :** టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి పెందుర్తి శ్రీనివాస్ దంపతులు బుధవారం నగరాల సీతారామస్వామి, మహాలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నగరాల సోదరుల ఆహ్వానంతో ప్రతి ఏడాది ఆనవాయితీగా దుర్గాష్టమి నాడు నగరాల సీతామహాలక్ష్మి అమ్మవారు, రామస్వామిలను కుటుంబ సమేతంగా దర్శించుకుంటున్నామని తెలిపారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని, విజయవాడ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, వ్యాపారాలు వృద్ధి చెందాలని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నామన్నారు. నగరాలు సామాజిక వర్గం ఓ గొప్ప రాజకీయ చైతన్యం కలిగివుందని, మరుపిళ్ళ చిట్టి,తమ్మిన పోతురాజు లాంటి ఎందరో మహానుభావులు ఈ సామాజిక వర్గానికి చెందినవారేనని గుర్తు చేశారు. అయితే, గత 50 ఏళ్ళుగా నగరాలు ఓటర్లుగానే ఉండి పోతున్నారని, నగరాలు తమ పూర్వీకులను ఆదర్శంగా తీసుకొని ఆర్థికంగా. సామాజికంగా బలపడి చట్ట సభల్లో ప్రాతినిధ్యం వహించాలని పెందుర్తి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

## కృష్ణాజిల్లా ఎస్ సీ సెల్ ఆధ్వర్యంలో నిరసన



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రభుత్వ మెడికల్ కళాశాలల ను ప్రైవేటీకరణ చేయవద్దంటూ వైసీపీ ఎస్‌సీసెల్ విభాగం నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మచిలీపట్నం లక్ష్మీ టాకీస్ సెంటర్లో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పిపిఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ నాయకులు, కార్యకర్తలు శాంతియుతంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్ట జాన్ విక్టర్, గుడివాడ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోవాడ అశోక్, పామర్రు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, కొడాలి సురేష్,రాష్ట్ర ఎస్సీ సెల్ స్పోక్ పర్సన్ మండ కిరణ్ కుమార్, రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీ నడకుదురు రాజేంద్ర, స్టేట్ జాయింట్ సెక్రెటరీ గాదెల్లి డేవిడ్, బురద రామారావు, జక్కుల ఆనంద్ బాబు, గడిదేశి రాజు, గూడవల్లి నాగరాజు, పోలిమెట్ల వంశీ, నితీష్ చంద్ర, మాది శివరామకృష్ణ,గడిదేశి బాల యేసు,తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గడంతో ఆక్వా రంగానికి ఊరట



**పెడన మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొన్ని వ్యాపారాలకు సంబంధించి వస్తువులపై జిఎస్టి తగ్గించడంతో ఆక్వా రంగానికి ఎంతో ఊరట లభిస్తుందని,ఎక్కడ చూసినా ఆక్వారంగం బాగా విస్తరిస్తోందని, ఈ ఆక్వా రంగంలో వినియోగించే కొన్నింటిపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందని గుడివాడ కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్-2 రంగమణి అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మార్కెట్ యార్డ్ కమిటీ సమావేశం హాలులో ఆక్వా రైతులకు జీఎస్టీపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రంగమణి మాట్లాడుతూ ఫీష్ అయిల్‌తో పాటు ఆక్వా చెరువులలో వినియోగించే పలు యంత్ర పరికరాలపై కూడా జీఎస్టీ తగ్గిందన్నారు. ఏ వస్తువులపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ ధరల ఏ విధంగా తగ్గాయో తెలుసుకోవాలనేదానిపై రైతులకు వివరించారు. దీంతో ఆక్వా రైతాంగానికి కొంత ఊరట లభిస్తుందని పేర్కొన్నారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న ఆక్వా రంగానికి ఇది ఒక వరం లాంటిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి మత్స్యశాఖ ఏడీ సీతారామాంజనేయులు, బంటుమిల్లి ఎఫ్‌డీవో వి సాయికృష్ణ, ఎంపీడీవో కార్యాలయం ఏవో శివకుమార్, ఆక్వారైతులు తదితరులు పాల్గొన్నారు.

# నూతనంగా గ్రీన్ ఫీల్డ్ రోడ్డు ఎందుకు నిర్మించటం లేదు





### నగరానికి ఒక రోడ్డు కంటే రెండు రోడ్డులు ఉండటం ప్రయోజనం కదా...

### జాతీయ రహదారిని తరకటూరు లేదా గూడూరు నుండి హర్ష కాలేజీ వరకు నిర్మించాలి

### జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీకి రైతుల వినతి

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లోని మూడు జిల్లాలకు దగ్గరలో ఉన్న పోర్టు మచిలీపట్నం పోర్టు. రానున్న కాలంలో దేశములోనే అతిపెద్ద పోర్టులలో ఒకటిగా మారే అవకాశాన్ని గుర్తించకుండా నగరం మధ్యలో ఉండబోయేలా జాతీయ రహదారిని 6ల్నెన్ల రోడ్డుగా విస్తరించేలా పనులు సాగుతున్నాయి. దీంతో అటు రైతులు,ఇటు మచిలీపట్నం వాసులు, సీనియర్ సిటిజన్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి అభివృద్ధి పేరిట ఉన్న రోడ్డునే విస్తరిస్తే అందరికీ నష్టమని, మరో రోడ్డు నిర్మిస్తే అటు మచిలీపట్నం నగర అభివృద్ధికి అవకాశం కలగడంతో పాటు ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో వ్యయం తగ్గే అవకాశం ఉంది. మచిలీపట్నం అభివృద్ధికి త్వరలో చేపట్టనున్న జాతీయ రహదారి విస్తరణ,అభివృద్ధి పనులు ఆటంకం అయ్యేలా కనిపిస్తోంది. జాతీయ రహదారి 65 విస్తరణలో భాగంగా త్వరలో భూసేకరణ చేయనున్నారు.ఇప్పటికే సర్వే పనులు శరవేగంగా సాగుతున్నాయి.అయితే ఇక్కడే అసలు సమస్య వచ్చి పడిరది. కనీసము 20 సం.ల దూర దృష్టి లేకుండా నగరము మధ్యలో ఉండేలా పోర్టు రోడ్డును నిర్మిచబోతున్నారు.

**గూడూరు నుంచి జాతీయ రహదారి మళ్లిస్తే...!**

ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారి 65ను విస్తరణలో భాగంగా గూడూరు నుంచి మూడు మచిలీపట్నం మూడు స్థంబాల సెంటర్‌కు సమీపంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర్లో మలుపు తిప్పే విధంగా ప్రస్తుతం ప్రతిపాదనలు ఉన్నాయి. దీని వలన గూడూరు నుంచి మచిలీపట్నం వరకు ఉన్న రోడ్డుకి ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజల, రైతుల భూములు మరోసారి కోల్పోవాల్సి వస్తుంది. ఇప్పటికే వారు రెండు సార్లు రోడ్డు విస్తరణకు భూములు ఇచ్చారు. దీంతో వారికి మిగిలిన కొద్దో గొప్పో భూములు కూడా కోల్పోవలసి ఉంది.పైగా ఆ భూములకు కూడా ప్రభుత్వం రెండు మూడు రెట్ల ధర చెల్లించాల్సి ఉంది. అదేవిధంగా ఉన్న రోడ్డునే మచిలీపట్నం శివారు వరకు నిర్మించడం వలన రానున్న 20 సం?ల కాలంలో మచిలీపట్నం నగర అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుంది. పైగా నగర ప్రజలకు నిత్యం ట్రాఫిక్, పొల్యూషన్ వెతలు ఉండే అవకాశం ఉంది.

**గూడూరు నుంచి పోర్టు రోడ్డుకు అనుసంధానిస్తే...!**

గూడూరు నుండి తిన్నగా పోర్టు రోడ్డుకు జాతీయ రహదారి అనుసంధానము చేస్తే అందరికి మేలు జరగనుంది. జాతీయ రహదారిని తరకటూరు లేదా గూడూరు నుండి హర్ష కాలేజీ వరకు తిన్నని రహదారిగా నిర్మించే అవకాశం ఉంది. గూడూరు నుండి హర్ష కాలేజి వరకు 6 కి.మీల దూరము మాత్రమే. ప్రస్తుత ప్రతిపాదిత 6 ల్నెన్ల రహదారి 8.2 కి.మీ లు. కావున గూడూరు నుండి హర్ష కాలేజి వద్ద కలిసి పోర్ట్ రోడ్డు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తే దూరం 2.2 కి? మీ?లు (30శాతం), సమయము 50శాతం తగ్గుతుంది. జాతీయ రహదారి ఎటువంటి వంపులు లేకుండా 6 కి?మీ మేర మాత్రమే నిర్మించే అవకాశాలు ఉన్నా రోడ్డుపై రోడ్డు నిర్మించేలా సన్నాహాలు, సర్వేలు చేస్తుండటం పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనివలన ప్రభుత్వానికి వ్యయంతో పాటు నిర్మాణ సమయం కూడా ఆదా అవుతుంది. రైతులకు కూడా మేలు చేకూరుతుంది. కొత్త ప్రాంతంలో జాతీయ రహదారి రావడంతో ఆ ప్రాంతం రానున్న కాలంలో మరింత అభివృద్ధి చెందేందుకు దోహదపడుతుంది. మచిలీపట్నం అభివృద్ధికి విస్తరణకు రానున్న 20 ఏళ్లకాలంలో వృద్ధి చెందేందుకూ అవకాశం ఉంటుంది. ఇన్ని అవకాశాలు ఉన్నప్పుడు ఉన్న రోడ్డు పైనే మరో రోడ్డును ఎందుకు నిర్మించాలి. నూతనముగా గ్రీన్ ఫీల్డ్ రోడ్డు ఎందుకు నిర్మించటం లేదు. నగరానికి ఒక రోడ్డు కంటే రెండు రోడ్డులు ఉండటం ప్రయోజనం కదా.ఈ విషయాన్ని ఎందుకు పరిశీలనలోకి తీసుకోవడం లేదనేది రైతులు భావిస్తున్నారు.మరో హైవే నిర్మాణం కూడా అభివృద్ధికి తోడ్పడకుండా రోడ్డుపై రోడ్డు నిర్మించే ప్రయత్నం చెయ్యటం పగపట్టి బందరు అభివృద్ధికి ఆటంక పర్చడమే అని భావించవలిసి వస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. వెంటనే ఈ తరహా యత్నాలను, సర్వే పనులు ఆపి రైతులకు,మచిలీపట్నం నగర అభివృద్ధికి దోహదపడేలా రోడ్డు మ్యాప్ మార్పించేలా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు జిల్లా కలెక్టర్ డి.కె బాలాజీకి వినతిపత్రం సమర్పించారు. ఆయన ఈ అంశంపై సానుకూలంగా స్పందించి తగిన చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.





### డా. ఎస్. జె. ఎర్నెస్ట్ మృదుస్వభావి అత్యంత కౌశల్యవంతులు : మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మంగళవారం ఉదయం నోబెల్ కళాశాలలో జరిగిన డా. ఎస్. జె. ఎర్నెస్ట్ పదవీ విరమణ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంలో మంత్రి కొల్లు రవీంద్ర డా. ఎస్. జె. ఎర్నెస్ట్ ని అభినందించారు.ఆయన మృదుస్వభావి,అత్యంత కౌశల్యవంతులు అని గుర్తుచేసి,విద్యార్థిగా ప్రారంభించి, లెక్చరర్‌గా ఆ తర్వాత ప్రిన్సిపల్‌గా సేవలందిస్తూ రిటైర్మెంట్‌కు చేరినందుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.డా. ఎర్నెస్ట్ కృషి కళాశాల విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించడంలో, కళాశాల ప్రతిష్టను పెంచడంలో విశేషమైనదని, అలాగే మచిలీపట్నం ప్రాంత అభివృద్ధిలో కూడా ఆయన పాత్ర అవసరమని స్పష్టం చేశారు. భవిష్యత్తులో మంచి మార్గదర్శకుడిగా కొనసాగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్మన్ బాబా ప్రసాద్, కళాశాల అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు హాజరయ్యారు.

### పీఏసీఎస్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గోపు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మంగళవారం కానూరు పీఏసీ ఎస్‌లో నిర్వహించిన మహాజన సమావేశానికి ముఖ్య అతిథిగా కృష్ణాజిల్లా రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ హాజరయ్యారు.సొసైటీ ప్రెసిడెంట్ గోపు ప్రతాప్ నరేష్ కుమార్, డైరెక్టర్స్ అయిన దివి మహేష్, చెక్కా నాగరాజు, గోపు నగేష్ కుమార్, బొలిశెట్టి నాని, గణపాబత్తుల చూడామనిరావు,ఇతర సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో సంఘం యొక్క నూతన భవన నిర్మాణం గురించి,2024-25 సంవత్సరం ఆడిట్ దాఖలా లాభనష్టాలు, వాయిదా మీరిన బకాయిలు వాటికి చట్ట పరంగా తీసుకోవలసిన చర్యలు గురించి చర్చించటం జరిగింది. అని పీఏసిఎస్ ఛైర్మెన్ గోపు ప్రతాప్ నరేష్ కుమార్ సెక్రటరి అడపా శ్రీనివాసరావు తెలిపారు.

### గ్రామాభివృద్దే మా కుటుంబ లక్ష్యం : పరిమి వంశీ



**గన్నవరం, సెప్టెంబర్ 30, మేజర్ న్యూస్ :** గ్రామాభివృద్దే లక్ష్యంగా మా కుటుంబం పనిచేస్తుందని పరిమి వంశీ పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరు గ్రామంలో విశ్వబ్రాహ్మణుల రుద్రభూమి అభివృద్ధికి పరిమి వంశీ ఆయన సతీమణి సింధూర కమిటీ సభ్యులకు మంగళవారం ఐదు లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ మాతండ్రి గ్రామ మాజీ సర్పంచ్ పరిమి రమేష్ గత 40 ఏళ్లుగా గ్రామ అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారని తెలిపారు. ఆయన స్ఫూర్తితో గ్రామంలో విశ్వబ్రాహ్మణుల రుద్రభూమి అభివృద్ధి కోసం రూ:5 లక్షల చెక్కును అందజేయడం జరిగిందన్నారు. రుద్రభూమి విస్తరణ, మౌలిక వసతుల ఏర్పాటుకు ఈనిధులు వినియోగించుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ పరిమి వంశీ-సింధూర లు గ్రామ అభివృద్ధికి చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. పరిమి రమేష్ వారసత్వాన్ని కొనసాగిస్తున్న వంశీ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శీలం రంగారావు, పరిమి విష్ణు, తోటకూర అజయ్ బాబు, అయినంపూడి సాంబయ్య, విశ్వబ్రాహ్మణుల రుద్రభూమి అభివృద్ధి కమిటీ సభ్యులు హరి, చక్రవర్తి, కోడూరు రవి, శ్రీనివాస్, నాగభూషణం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



### ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

**నాగాయలంక సెప్టెంబర్ 30 మేజర్ న్యూస్ :** నాగాయలంక మండలం నాగాయలంక గ్రామంలోని దేవి శ్రీ పార్వతీ సమేత,కన్యకా పరమేశ్వరి సమన్విత శ్రీ నగరేశ్వర స్వామి వారి, ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగముగా మంగళవారం రాత్రి నాగాయలంక గ్రామంలోని వినాయకుడిని దేవస్థాన ప్రాంగణం నుండి ఆకుతోట వెంకట సీతారామయ్య, శిరీష, దంపతులు, బతుకమ్మను అందంగా అలంకరించి, సహచర ముత్తైదువులు చేసిన బతుకమ్మను ఊరేగింపుగా కోలాటం మధ్య ఆటపాటలతో బతుకమ్మను విశేషాలంకారాలతో దేవి శ్రీ పార్వతీ సమేత కన్యకా పరమేశ్వరి సమ న్విత శ్రీ నగరే శ్వర స్వామి వారి సన్నిధిలో గల కనకదుర్గాదేవి ప్రతిమ వద్దకు ఊరేగింపుగా, వెళ్లి ఆట పాటలతో బతుకమ్మను కొలిచారు. ఈ కార్యక్రమానికి, దేవస్థాన చైర్మన్ చిట్టా సాంబశివరావు, చిట్టా శివ, నాగేశ్వరరావు, తాడికొండ సత్యనారాయణ, చిట్టా వీర అన్న పూర్ణయ్య, చిట్టా శేఖర్, వంకాయల రాజేష్, కమిటీ పెద్దలు, మహిళామణులు, భక్తులు,అధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేసినారు.

## వైభవంగా నవరాత్రి మహోత్సవాలు

### వివిధ రూపాల్లో రోజుకో అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** మండలంలోని పి.నైనవరం గ్రామంలోని శ్రీ శివ నాగేంద్ర స్వామి దేవస్థానంలో నవరాత్రి మహోత్సవాలు. గత తొమ్మిది రోజులుగా దసరా నవరాత్రుల సందర్భంగా రోజుకో అలంకారంతో భక్తులకు వివిధ రూపాల్లో అమ్మవారు దర్శనమిస్తున్నారు. ఇందులో భాగంగా కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అంబరాన్ని అంటుతున్నాయి. ప్రతిరోజు దుర్గమ్మ వారికి పూజా కార్యక్రమాలు ఉదయం, సాయంత్రం పూజారి తులసి అమ్మవారి కార్యక్రమాలు నిర్వహించటం విశేషం. ఈరోజు అనగా దుర్గాష్టమి అలంకారంతో కుంకుమార్చన కార్యక్రమాలు మహిళలు పెద్ద సంఖ్యలో విజయవంతం చేశారు. అనంతరం గ్రామ ప్రజలందరికీ అన్న సంతర్పణ కార్యక్రమం అతి వైభవంగా జరిగింది. గత 10 సంవత్సరాల నుంచి ఈ దసరా నవరాత్రీ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని పి.నైనవరం శ్రీ శివ నాగేంద్ర స్వామి కమిటీ సభ్యులు వివరించారు.









## ఆలయాల జీర్ణోద్ధరణకు రూ.20వేల విరాళం

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ గంగానమ్మ తల్లి దేవస్థానాల పునర్నిర్మాణ పనులకు మంగళవారం దాత వల్లభనేని శివశంకర వరప్రసాద్ కుమారుడు హరీష్ రూ.20 వేలను అందించారు. గుడ్లవల్లేరు ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, నెహ్రూ పశువుల సంత కమిటీ కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, సభ్యులు పోలవరపు వెంకట్రావు, చాపరాల సుధాకర్, పీఏసీఎస్ అధ్యక్షుడు వెనిగెళ్ల నాగేశ్వరరావు, దేవస్థాన ధర్మకర్తలు మురాల నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## కొండలమ్మను దర్శించుకున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** దసరా నవరాత్రుల్ని పురస్కరించుకుని మండంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, రాష్ట్ర బీసీ నాయకుడు కొనకళ్ల బుల్లయ్య మంగళవారం దర్శించుకున్నారు. ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు, ధర్మకర్తలు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. వారికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అమ్మవారి చిత్ర పటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. ఆలయ తొలి మేనేజర్ జక్కా ధర్మారాయుడు, సీఐ సోమేశ్వరరావు, ఎస్.ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కనులపండువగా అమ్మవారి ఊంజల్ సేవ



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** దసరా నవరాత్రుల్ని పురస్కరించుకుని మండలంలోని డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి సన్నిధిలో అమ్మవారికి ఊంజల్ సేవను వేద మంత్రోచ్ఛరణ నడుమ కనుల పండువగా నిర్వహించారు. మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి భక్తులు తండోపతండాలుగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలను స్వీకరించారు.



## దర్శనానికి వచ్చే అమ్మవారి భక్తులకు వర్షం వల్ల ఎటువంటి ఇబ్బంది కలగరాదు!

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** దర్శనానికి వచ్చే అమ్మవారి భక్తులకు వర్షం వల్ల ఎటువంటి ఇబ్బంది కలగరాదని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం సాయంత్రం వర్షం పడిన సందర్భంగా దసరా శరన్నవరాత్రుల ఉత్సవ వేడుకలలో భాగంగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కు రహదారుల పైన వర్షపు నీటి నిల్వలతో ఎటువంటి ఇబ్బంది పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విజయవాడ నగరంలో మాన్సూన్ రెస్పాన్స్ టీమ్లో అప్రమత్తంగా ఉంటూ వర్షపునీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించాలని, ప్రత్యేకంగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా దర్శన రహదారులలో వర్షపు నీటి నిల్వలు ఎక్కడున్నా వెంటనే సూపర్ సక్కర్లు, మోటర్లు, గల్ఫర్లతో వర్షపు నీటి నిలువలను తొలగించాలని, మరుగుదొడ్ల పాయింట్ల వద్ద ప్రత్యేక శ్రద్ధ వహించి వర్షపునీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# అంబరాన్నంటిన దుర్గాష్టమి సంబరాలు





**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో దుర్గాష్టమి సంబరాలు అంబరాన్నంటాయి. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అమ్మవారి ఊరేగింపులో పాల్గొని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకట్టుకున్నారు. జానపద ఇంద్రజాల ప్రదర్శనలు, చిత్ర విచిత్ర శక్తి వేషధారణలు, కనక డప్పుల వాయిద్యాలు, మేళతాళాలు, తీన్‌మార్ డప్పులు, చిన్నారుల కోలాట ప్రదర్శన, కేరళ వాయిద్యాలు, గరగ నత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అడుగడుగునా గ్రామాల్లో అమ్మవారి ఊరేగింపుకు బ్రహ్మరథం పట్టారు. పళ్లు, టెంకాయలను మహిళా భక్తులు సమర్పించారు. అలాగే అమ్మవారి సన్నిధిలో కుంభం పోసి వేలాది మందికి అన్నసమారాధన చేపట్టారు. అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదాలను స్వీకరించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, సాగునీటి డీసీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, మాజీ సర్పంచి కొడాలి రామరాజు, చేకూరి జగన్మోహనరావు, తొలి ఆలయ మేనేజర్ జక్కా ధర్మారాయుడు, దేవస్థాన సభ్యులు తూము రాజ్యలక్ష్మీ, కళ్ళేపల్లి సుగుణ శేఖర్, వడ్లమూడి రవీంద్ర బాబు, పెద్దిబోయిన శ్యామలా దేవి, ఎక్స్-అఫీషియో మెంబర్ రుద్రపాక శరశ్చంద్ర శివ సంతోష్ శర్మ పాల్గొన్నారు.

# లక్షలాది భక్తులకు అలుపెరగని సేవలు





**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 30, మేజర్ న్యూస్ :** విజయవాడ ఇంద్రకీలాద్రి దసరా నవరాత్రులలో అమ్మవారి దర్శనానికి మన రాష్ట్రం నుంచే కాక దేశంలోని సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులకు అవసరమైన సేవలందించడానికి దేవస్థానం, జిల్లా యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పలు ఏర్పాట్లు చేశాయి. చిన్నారులకు వేడి పాలు, బిస్కెట్లు అందిస్తున్నారు. రద్దీగా ఉండే క్యూలైన్లలో ప్రతి ఒక్కరికి అందేలా విశేష కృషి చేస్తున్నారు. మొదటి ఎనిమిది రోజులలో 1,75,000 బిస్కెట్ ప్యాకెట్లను, మూడు లక్షల అరవై వేల మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. 6,600 లీటర్ల పాలను 70 వేల కప్పుల ద్వారా భక్తులకు అందించారు. భక్తులకు 8 రోజులలో 35 లక్షల మంచినీటి సీసాలు పంపిణీ చేశారు. వృద్ధులు, దివ్యాంగులకు దర్శనంలో ఇబ్బందులు కలగకుండా బ్యాటరీ కార్లు, చక్రాల కుర్చీలు ఏర్పాటు చేశారు. అధికార యంత్రాంగం తో పాటు వందలాదిమంది సేవకులు స్వచ్ఛందంగా రేయింబవళ్లు భక్తులకు సేవలందిస్తున్నారు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉండే రెడ్ క్రాస్ సంస్థ రోజుకు మూడు షిఫ్టుల్లో వృద్ధులకు, దివ్యాంగులకు సేవలందిస్తోంది. అటు పోలీసు యంత్రాంగం "సేవాదళ్" పేరిట ఒక బృందాన్ని ఏర్పాటు చేసి భక్తులకు సాయపడుతోంది. హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ భక్తులకు పాలు అందించడంలో చురుకైన పాత్ర పోషిస్తోంది. లిటిల్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థకు చెందిన "శక్తి సేవ" వాలంటీర్లు దేవాలయంలోని వివిధ విభాగాలలో సేవలందిస్తున్నారు. నగరపాలక సంస్థకు చెందిన 1490 మంది పారిశుద్ధ్య కార్మికులు వివిధ ప్రాంతాలలో సేవలందిస్తున్నారు. దేవాలయ ప్రాంగణంలోని మరుగుదొడ్ల ను పరిశుభ్రంగా ఉంచుతూ భక్తుల మన్ననలు పొందుతున్నారు. రేయింబవళ్లు అలుపెరగకుండా అందిస్తున్న సేవలపై భక్తులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.















# తీరప్రాంతాలలో దశలవారీగా అభివృద్ధి



## బందరుకోట, గిలకలదిండిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం మేజర్ న్యూస్ : గిలకలదిండి, బందరుకోట వంటి తీర ప్రాంతాలను దశలవారీగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం మంత్రి 21వ డివిజన్, బందరుకోటలో శ్రీ కోదండ రామస్వామి, హనుమాన్ టెంపుల్ సమీపంలో రూ.30 లక్షల విలువైన మూడు సీసీ రోడ్ల పనులు, అదేవిధంగా 20వ డివిజన్, గిలకలదిండిలో రూ.10 లక్షల వ్యయంతో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో బందరుకోటలో దాదాపు రూ.30 లక్షల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. శ్రీ కోదండ రామస్వామి, హనుమాన్ టెంపుల్ కు వెళ్లే దారికి సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని, దీని ద్వారా వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉండటంతో పాటు ఆ ప్రాంత అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. త్వరలో మచిలీపట్నం పోర్టు నిర్మాణం పూర్తి కానున్న నేపథ్యంలో నగరంలో డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన, రహదారుల విస్తరణకు కార్యాచరణ రూపొందించామన్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు గిలకలదిండిలో 2014-19 కాలంలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మించామని, అయితే సంబంధిత పనులు మొత్తం పూర్తయినప్పటికీ తర్వాత వచ్చిన ప్రభుత్వ నిర్లక్ష్యంతో వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా ఉండిపోయిందన్నారు. గత నెలలో వాటర్ ట్యాంక్ కు దాదాపు రూ.20 లక్షలు వెచ్చించి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చి ప్రజలకు పుష్కలంగా నీటిని అందిస్తున్నామన్నారు. అయితే ట్యాంకుకు రక్షణ ఉండాలనే ఉద్దేశంతో దాదాపు రూ. పది లక్షల వ్యయంతో ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, త్వరలో అది పూర్తి చేసి దానిని పరిరక్షించేందుకు నైట్ వాచ్మెన్ ను ఏర్పాటు చేసి నీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పుష్కలంగా నీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇదే రీతిలో బందరు కోటలో కూడా మరో ట్యాంకును నిర్మించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు మంత్రి తెలిపారు. తీర ప్రాంతంలోని గ్రామాల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో దశలవారీగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమాలలో మచిలీపట్నం మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ మెంబర్ లంకె నారాయణ ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యనారాయణ,పార్టీ టౌన్ ప్రెసిడెంట్ లోగిసెట్టి వెంకట స్వామి, బందరుకోట,గిలకలదిండి ఇన్చార్జిలు బచ్చు అనీల్, రమేష్, మాజీ కౌన్సిలర్ బత్తిన దాసు, గుమ్మడి విద్యాసాగర్, తలారి సోమశేఖర్ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# క్యూ లైన్స్‌లను స్వయంగా పరిశీలించిన సీపీ, కలెక్టర్





ఇంద్రకీలాద్రి, మేజర్ న్యూస్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి దర్శనంలో సామాన్య భక్తులకే పెద్దపీట వేయడమే లక్ష్యంగా చేసుకుని నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, జిల్లా కలెక్టర్ లక్ష్మీ శా అన్ని శాఖలను సమన్వయం చేసుకుని ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకుని పటిష్టమైన బందోబస్త్ ఏర్పాట్లను చేయడం జరిగింది.

మూలా నక్షత్రం సందర్భంగా మరో 1400 మంది సిబ్బందితో 200 రోప్ పార్టీలను ఏర్పాటు చేసి భక్తులలో ఎక్కడా తొక్కిసలాట జరుగకుండా ప్రశాంత వాతావరణంలో అమ్మవారి ధర్శనం అయ్యేవిధంగా బందోబస్త్ ను ముందు రోజు అర్ధ రాత్రి నుండి స్వయంగా పర్యవేక్షించడం జరిగింది. దసరా మహోత్సవాల నేపథ్యంలో మిగిలిన రోజులలో భవానీలు అధిక సంఖ్యలో అమ్మవారి ధర్శనం నిమిత్తం వస్తారన్న అంచనా మేర ఈ రోజు నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, జిల్లా కలెక్టర్ లక్ష్మీ శా ఇతర పోలీసు అధికారులతో కలిసి బస్ స్టాండ్, మున్సిపల్ కార్యాలయం, సీతమ్మ వారిపాదాలు, వినాయక టెంపుల్ పరిసర ప్రాంతాలలోని హోల్డింగ్ ఏరియా లను, క్యూ లైన్స్ లను నడు చుకుంటూ పరిశీలించి అదికారులకు తగు సూచనలు అంధించారు.నదీ ప్రవాహం ఎక్కువగా ఉన్నందున భక్తులు ఎవ్వరూ నదిలోనికి వెళ్లకుండా కేవలం జల్లు స్థానాలు వినియోగించే విధంగా బంధోబస్త్ ఏర్పాటు చేయాలని సూచనలు చేశారు. కేశఖండన శాల పరిసర ప్రాంతాలలో రద్దీ లేకుండా ఎప్పటికప్పుడు పంపించే విధంగా సిబ్బంది తగు సూచనలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. హోల్డింగ్ ఏరియాలలో భక్తులకు ఏర్పాటు చేసిన అన్నీ వసతులు అందుతున్నాయ లేదా ఏమైనా ఇబ్బందులు పడుతున్నారా అనే విషయాన్ని గమనించి వెంటనే సంబంధిత అదికారులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ధ్యాన్ చంద్, డి.సి.పి.లు కె.తిరుమ లేశ్వర రెడ్డి, ఎస్.వి.డి.ప్రసాద్, ఏ.డి.సి.పి. జి రామ కృష్ణ, సౌత్ ఏ.సి.పి. పావన్ కుమార్, రామచంద్ర రావు, ఇతర శాఖల అదికారులు, ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.





## 2న గాంధీ జయంతి సందర్భంగా కబేళా, చేపల మార్కెట్లు, మాంసపు దుకాణాలకు సెలవు

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**

విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : అక్టోబర్ 2, 2025 గాంధీ జయంతి సందర్భంగా సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఉత్తర్వుల మేరకు 02-10-2025 తేదిన ( గురువారం) నగరంలో ఉన్న కబేళాకు సెలవు ప్రకటించారు. నగరంలో ఉన్న అన్ని చికెన్ షాపులు, మటన్ షాపులు, చేపల మార్కెట్లు అన్నియు కూడా తెరుచుటకు అనుమతి లేదు. ఎవరైనా అనుమతి లేకుండా జీవాలను వధించిన యెడల, లేదా షాపులను తెరిచియుండి మటన్, చికెన్, చేపలను అమ్మిన యెడల చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకోనబడునని కమిషనర్ ఆదేశించారు. కావున మటన్, చికెన్, చేపలు హోల్ సేల్, రిటైల్ వ్యాపారస్తులు అన్ని షాపులు మూసి వేయవలెనని ఆదేశించడమైనది.

## సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

విజయవాడ, మేజర్ న్యూస్ : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మంగళవారం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంచాలకులు ఎమ్. శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ/వార్డు సచివాలయ జెఏసి సభ్యులు, తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామ వార్డు సచివాలయ కార్యదర్శిని ఇటీవల కోరటం జరిగిందన్నారు. గ్రామ/వార్డు సచివాలయం సభ్యులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానన్నారు. ప్రభుత్వం తరపున గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శి సానుకూలంగా స్పందించారని, గ్రామ, వార్డు సచివాలయం సంచాలకులు ఎమ్.శివప్రసాద్ తెలిపారు. ప్రభుత్వం సానుకూల దృక్పథాన్ని అనుసరించి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులందరూ తమ విధులకు హాజరై ప్రభుత్వ కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకము లేకుండా సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఎటువంటి సమస్య అయినా మనం సమిష్టిగా చర్చించి పరిష్కరించుకోవచ్చని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంచాలకులు ఎమ్.శివప్రసాద్ ఆ ప్రకటనలో తెలియజేశారు.

## పదవీ విరమణ పొందిన సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు

విజయవాడ క్రైం, మేజర్ న్యూస్: ఎన్.టి.ఆర్.జిల్లా నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి, కర్తవ్య నిర్వహణలో చిత్తశుద్ధి, అంకిత భావంతో పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలందించి మంగళవారం పదవీ విరమణ చేసిన నలుగురు పోలీస్ అధికారులను పోలీస్ కమీషనర్ వారి కార్యాలయంలో పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు డి.సి.పి. ఏ.బి.టి.ఎస్.ఉదయరాణి, ఇతర పోలీస్ అధికారులతో కలిసి సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు సమర్ధవంతమైన సేవలు అందించినందుకు గాను పదవీ విరమణ చేసిన అధికారులను అభినందించి పోలీస్ మర్యాదలతో శాలువాలతో సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికినారు. తిరువూరు పి.ఎస్. ఎస్ఐ జి.వేంకటేశ్వర రావు, సి.ఎస్.బి ఎస్ఐ ఎస్.జయరాం, 2 టౌన్ పి.ఎస్. హోంగార్డు ఎస్.అంజనేయులు, గవర్నర్ పేట పి.ఎస్ హోంగార్డు డి.శ్రీనివాస రావు పదవీవిరమణ పొందిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... పదవీ విరమణ చేస్తున్న అధికారుల ధరికి వారి కుటుంబ సభ్యులకు ధన్యవాధములు తెలియజేశారు. ఈ నేపధ్యంలో ప్రతి ఒక్క అధికారిని, వారి కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించి వారి యోగక్షేమాల గురించి తెలుసుకున్నారు. పదవీ విరమణ చేసిన అధికారులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు 24 గంటలూ ఉద్యోగ విధి నిర్వహణలో బాగంగా చాలా బిజీగా గడిపారు. ఇప్పటి నుండి ఒక్కసారిగా ఖాళీ అయితే చాలా ఇబ్బందిగా ఉంటుంది కనుక ఆధ్యాత్మిక పరంగా వెళ్లడమో లేదా ఏదో ఒక వ్యాపకం చూసుకోవాలి అని అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని తెలియజేశారు. అనంతరం పదవీ విరమణ చేసిన అధికారులను అభినందించి పోలీస్ మర్యాదలతో శాలువాలతో సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికినారు. ఈ కార్యక్రమంలో ఏ.బి.టి.ఎస్. ఉదయరాణి, ఆర్.ఐ.లు శ్రీనివాసరావు, సుధా కర్ రెడ్డి, సూపరిండెంట్ లక్ష్మణరావు, ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ అసోసి యేషన్ అధ్యక్షులు ఎం. సోమయ్య, అసోసియేషన్ సంఘ సభ్యులు, అధికారులు, సి.పి.ఓ. సిబ్బంది, పోలీస్ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## యడ్లపాడు వారి బావ ఎప్పుడు వచ్చితావు నాటక ప్రదర్శన

విజయవాడ, మేజర్ న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో "సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ" సారధ్యంలో వరల్డ్ బిగ్గెస్ట్ ఫెస్టివ్ కార్నివల్ "విజయవాడ ఉత్సవ్" నగరంలోని ఘంటసాల ప్రభుత్వ కళాశాల నందు 9వ రోజు సంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మానవతా యడ్లపాడు వారి నాటిక "బావ ఎప్పుడు వచ్చితీవు" నాటక ప్రదర్శన ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించింది.దీనికి రచన సహకారం స్వర్గీయ భవానీ ప్రసాద్ అందించారు. దర్శకత్వం జరుగుల రామారావు వహించగా, సంగీతం రమణ, ఆహార్యం పచ్చల శివ లు సహాయ సహకారాలు అందించారు.ఈ నాటకానికి నిర్వాహకులు ముత్తవరపు పద్మారావు, పోపూరి నాగేశ్వరరావు లు కాగా, నట వర్గంలో సుబ్బారావు పాత్రకు ముత్తవరపు సురేష్ బాబు, సుబ్బలక్ష్మి పాత్రకు లహరి, అన్నయ్య పాత్రకు పోపూరి శివరామ కృష్ణ, ఎలక్ట్రీషియన్ పాత్రకు ముత్తవరపు రామారావు, ఆఫీసర్ పాత్రకు జరుగుల శంకర రావులు అద్భుత ప్రదర్శన చేశారు.

# ఘనంగా జరగనున్న మూలాంకురేశ్వరీ దేవి నవరాత్రి ఉత్సవాలు





## గుంటూరు 12 కిలోమీటర్ల దూరం అమీనాబాద్‌లో గుడి

**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్, మేజర్ న్యూస్ :** శాతవాహనుల కాలంలో స్వయం భువంగా వెలసిన శ్రీ మూలాంకురేశ్వరి దేవి ప్రతి సంవత్సరం దసరా పండుగ రోజున వేలాది భక్తులతో విశేష పూజలు అందుకుంటుంది. ఒక దసరాకే కాకుండా ప్రతి పండుగలకు భక్తులు విశేష సంఖ్యలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి, గుంటూరు జిల్లాలోని చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు విచ్చేస్తారు. ఇక్కడ కొలువై ఉన్న అమ్మవారిని దర్శించుకుని పూజలు చేస్తే భక్తుల కోరికలు నెరవేరతాయని నమ్మకం, అందుకు పలు నిదర్శనాలను కూడా భక్తులు వ్యక్తం చేస్తూ ఉంటారు. గుంటూరు జిల్లా, గుంటూరు నుంచి నరసరావుపేటకు వెళ్లే దారిలో 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న అమీనాబాద్ గ్రామంలో కొండపై స్వయంభువంగా వెలిసింది శ్రీ మూల గౌరమ్మ అమ్మవారు. కాలక్రమేణా అమ్మవారు శ్రీ మూలాంకురేశ్వరి దేవిగా పిలవబడుతోంది. శాతవాహనుల పాలన అనంతరం కొండవీటి రెడ్డి రాజులైన ఆన వేమారెడ్డి ఈ గుడి నిర్మాణం చేసి ఈ అమ్మవారిని తమ కులదైవంగా పూజించేవారు. అమ్మవారి కరుణాకటాక్షాల వల్ల రెడ్డి రాజులు ఎన్నో విజయా లు సాధించారని పురాణాలు చెబుతున్నాయి. శాతవాహనుల పాలనలో మొద టిసారిగా శ్రీ మూల గౌరమ్మ అమ్మవారి గుడి కట్టినప్పుడు చిన్న విగ్రహాలను ఏర్పాటు చేశారని, ఆ తర్వాత కొండవీటి రెడ్డి రాజుల పాలనలో పలు దేవత విగ్రహాలు ఏర్పాటు చేశారు. అయితే ఔరంగాజేబు పాలనలో ఈ గుడిపై దండెత్తి పలు విగ్రహాలను ధ్వంసం చేశారు. మూలవిరాట్ కు మాత్రం ఎటు వంటి అపకారం జరగలేదు. కాలక్రమేణా ఈ గుడి నిరాదరణకు గురైంది. అమీనాబాద్ గ్రామంలోని పలువురు పెద్దలు, భక్తులు అమ్మవారిని కొలుస్తూ నిత్యం ధూప, దీప, నైవేద్యం పెడుతూ వచ్చారు. 1940 సంవత్సరంలో మహిమాన్వి తమైన శ్రీ మూలాంకురేశ్వరి గుడి జీర్ణ స్థితికి చేరుకోరాదని తలంచి పలువురు భక్తులు, పెద్దలు ఒక కమిటీగా ఏర్పడి గుడిని కాపాడు కుంటూ వచ్చారు. గుడి కమిటీ సభ్యులలో ఒకరైన బత్తుల పిచ్చయ్య ఆనాటి నుంచి గుడి ఆలనా పాలన చూస్తూ ప్రతి పండుగ దినాల లో ఉత్సవాలు చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు ఆ గుడికి పిచ్చయ్య కుమారుడైన బత్తుల వేణుగోపాల్ బాబు ఆలయ కమిటీకి, అభివృద్ధి కమిటీకి చైర్మన్ గా ఉండి అందరి సహాయ సహకారాలతో పనిచేస్తు న్నారు. శ్రీ మూలాంకురేశ్వరి గుడికి ఎటువంటి ఆదాయం లేదు. గుడి పేరున 8 ఎకరాలు మాత్రమే ఉంది. కౌలుకు ఇచ్చారు. సంవత్సరానికి ఎకరాకు 12 వేల రూపాయలు మాత్రమే కౌలు ద్వారా వస్తుంది. అంటే గుడి ఆదాయం లక్ష రూపాయలు మాత్రమే. ఈ గుడి విషయమై ఆలయ కమిటీ చైర్మన్ బత్తుల వేణుగోపాల్ బాబును వివరణ కోరగా గుడి అభివృద్ధికి అందరం సమిష్టిగా కృషి చేస్తున్నాం. గుడి దగ్గర వరకు రోడ్డు వేశాం. గుడికి దాతల సహకారంతో కొంత అభివృద్ధి చేసి ఏసీ కూడా పెట్టిచ్చాం అని అన్నా రు. దసరా ఉత్సవాలతో పాటు కార్తీక మాసంలో ఘనంగా పూజలు జరు పుతుంటామని అన్నారు. అమీనాబాద్ గ్రామం జనాభా సుమారు 5 వేలు వర కు ఉంటుంది. మతసామ రస్యతకు పెట్టింది పేరు. ముస్లింలు ఈ గ్రామంలో అధికం. హిందువులు, ముస్లింలు అందరూ ఎంతో కలిసిపోయి సోదర భావం తో మెలుగుతూ ఒకరి కొకరు సహాయ సహకారాలు అందించుకుంటారు. అమీనాబాద్ గ్రామం ప్రకృతి అందాలతో ఆహ్లాదంగా ఉంటుంది. మనం ఆ గ్రామంలోకి అడుగుపెట్టగానే పడమటి దిక్కున శ్రీ మూలాంకురేశ్వరి అమ్మవా రు మనల్ని ఆశీర్వదిస్తూ ఉంటుంది. చుట్టూ పచ్చని చెట్లు, కొండలు, చల్లటి గాలి మన మనసుల్ని సున్నితంగా తాకుతూ అబ్బురపరుస్తూ ఉంటాయి. ప్ర శాంత జీవితానికి చిరునామాగా నిలిచే అమీనాబాద్ ను ఒక్కసారైనా వెళ్లి అ మ్మవారి ఆశీస్సులు తీసుకుని వస్తే మన జన్మ ధన్యమైనట్లేనని అనిపిస్తుంది.

# వరద ప్రవాహంతో అల్లాడుతున్న మత్స్యకార కుటుంబాలు





**నాగాయలంక సెప్టెంబర్ 30, మేజర్ న్యూస్ :** నాగాయలంక గ్రామం లో కృష్ణాపుష్కర్ ఘాట్ వద్ద ఉండే మత్స్యకారుల గృహాలు వరద నీటి కారణంగా గృహాలు కొంత భాగం నీటిలో మునగటం చేత, బాధితులు పొట్టచేత పట్టుకుని పనిలేక అల్లాడిపోవుతున్నారు. జీవన ఆధారమైన వేటాడే పరిస్థితి ఇప్పటిలో కనుపడుటలేదు. నాగాయలంక గ్రామంలో కుల మతాలకు అతీతంగా, అన్ని కులాల వారు వేటను వృత్తిగా మలుచుకొని జీవనాధారం సాగించుచున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కృష్ణమ్మ ఎప్పుడు శాంతించునో ఎప్పుడు మాయొక్క జీవనాధారమైన చేపల వేట సాగునా అని ఆశతో ఎదురు చూస్తున్నారు. వరద నీటిలో గృహాలు పాడు అగుట చేత రొయ్యల వ్యాపార కేంద్రాలు నాశనం అగు ట చేత వ్యాపారస్తులు గృహాల్లో జీవించు, మత్స్యకారుల నివాసస్థుల బాధలు వర్ణనాతీతం ఇప్పటికైనా దయవుంచి వేటను వృత్తిగా, చేసుకుని ఆధారపడే వ్య క్తులను గురించి ఆరా తీసి తగిన న్యాయం చేస్తారని అధికారులను కన్నీటితో వేడుకొనుచున్నారు. కృష్ణానది ఒడ్డున గతంలో గల రైతుల యొక్క పొలాలు కృష్ణానదిలో కలియుట చేత అచట ఉన్న భూములు నదీగర్భంలో కలిసి పోవు టవలన పెద్దలు వదిలివేసి ఉన్నారు. కానీ కొంతమంది అక్రమార్కులు రిజిస్టర్ ఆఫీస్ ద్వారా అక్కడ ఎవరు ఎవరికి భూములు కలవో పరిశీలించి వారికి, డబ్బులు ఆశ చూపించి వాళ్ల చేత రాయించుకుని రియల్ ఎస్టేట్, వెంచర్స్ వేసి ఆభూమిని కొంతమంది అక్రమార్కులు వారు పేరున రిజిస్ట్రేషన్ చేయిం చుకుని నదీ గర్భాన్ని పూడ్చి అచ్చట తీరప్రాంత మత్స్య కారులకు వేట దారు లకు రొయ్యల కంపెనీ వాళ్లకు పీతల కంపెనీ వాళ్లకు, విద్యుత్ శాఖ రెవెన్యూ శాఖ పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలిసి, నదీ గర్భంలో కలి సిన భూ మిని తాత్కాలికంగా పూడి పించి వేసి అచ్చట నివాస గృహాలు వేసి విక్రయిం చుచూ ఇంటి పన్నులు విద్యుత్ సౌకర్యం, రోడ్లువేయించి రొయ్యల కంపెనీలు పెట్టించుచూ, బాడుగకూ ఇవ్వుచూ, తరచు వరద ప్రవాహంనకు ప్రజలను గురి చేయించుచున్నారు. ఇప్పటికైనా ప్రస్తుతం ఉన్న అధికారులు, ఎంక్వైరీ చే సి అక్రమార్కుల పైన తగిన చర్యలకు సిఫార్సు చేసి గతంలో జరిగిన పొరపా ట్లను సరిదిద్ది కూటమి ప్రభుత్వంనకు, మంచి పేరు తీసుకుని వచ్చి, గతంలో జరిగిన అవినీతి పైన విచారణ చేసి తీరప్రాంత మత్స్యకారులకు చేపలువేట పై ఆధారపడి జీవించే వారికి న్యాయంచేస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

# కాళేశ్వరరావు మార్కెట్లో వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

### అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి అన్నదానం ప్రారంభించిన ఎంపీ





**విజయవాడ, సెప్టెంబర్ 30, మేజర్ న్యూస్ :** విజయవాడ వన్ టౌన్ కాళేశ్వరరావు మార్కెట్లో శ్రీ సత్యనారాయణ స్వామి కూరగాయాల చిల్లర వర్తక సంఘం, వర్తక సం ఘాల ఐక్యత కమిటీ ఆధ్వర్యం లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు ఎంపీ కేశినేని శివనాథ్ మంగళవారం కనకదుర్గాదేవి అలంకరణలో కొలువైన అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఎంపీ కేశినేని శివనాథ్ కు మంగళవాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం గజమాలతో సత్కరించి, శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఉత్సవ కమిటీ నిర్వాహకులతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ అన్నదానం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి మైలవరపు కృష్ణ, ఉపాధ్యక్షుడు ఆకుల రాజు, కోశాధికారి ఏ.గంగాధర్, పైడి కృష్ణ, ఎల్.అప్పారావు, ఎస్.తారక రామ్, మాత శివ, ఆకుల శ్రీను, అల్లం గణేష్, కోలా శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.



# సీఎం పర్యటనకు సిద్ధమవుతున్న గాంధీ హిల్

### చురుగ్గా సాగుతున్న అభివృద్ధి పనులు

### కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశా, వీఎంసీ కమిషనర్ ధ్యాన్ చంద్‌లతో కలిసి పనులను పర్యవేక్షించిన ఎంపీ కేశినేని శివనాథ్



**విజయవాడ, సెప్టెంబర్ 30, మేజర్ న్యూస్ :** విజయవాడకు మణిహారమైన గాంధీ హిల్ మ రింత ఆకర్షణీయంగా రూపుదిద్దు కుంటోంది. అక్టోబర్ 2న ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నా యుడు పర్యటన సందర్భంగా కొండపై జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేశారు. ఈ నేప థ్యంలో కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశా, వీఎంసీ కమిషనర్ ధ్యాన్ చంద్‌లతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ అక్కడి పనులను పర్యవేక్షించారు. పర్యాటకు లకు సౌకర్యవంతంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దే దిశగా ఆధునిక సదుపా యాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. కొండపైకి వెళ్లే రోడ్ విస్తర ణ, లిఫ్ట్ నిర్మాణం, రైల్వే ట్రాక్ అభివృద్ధి, పార్క్ సౌకర్యాలు వంటి పనుల పురోగతిని ఎంపీ సమీక్షించారు. సౌకర్యాలు పూర్తి స్థాయిలో సిద్ధం చేయా లని అధికారులకు ఆయన సూచించారు. గాంధీ స్మారక స్థూపం పరిసర ప్రాంతాలను శుభ్రంగా, అందంగా తీర్చిదిద్దే పనులు జరుగుతున్నాయని ఎంపీ వెల్లడించారు. హరిత వన కార్యక్రమాలు, లైటింగ్ ఏర్పాట్లతో గాంధీ హిల్‌కు కొత్త కళ రానుందని చెప్పారు. “ఇది కేవలం పర్యాటక స్థలం మాత్రమే కాదు, సాంస్కృతిక కార్యకలాపాలకు కూడా వేదిక కావాలి” అని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. అభివృద్ధి పనులను తక్షణం పూర్తి చేయా లని అధికారులకు సూచించిన ఎంపీ, ముఖ్యమంత్రి పర్యటనలో గాంధీ హిల్ ప్రత్యేక ఆకర్షణగా నిలవాలని ఆదేశించారు. “గాంధీ హిల్ అభివృద్ధి పనులు విజయవాడ గౌరవానికి ప్రతీకగా ఉండాలి. నగర ప్రజలందరికీ గర్వకారణంగా మారేలా తీర్చిదిద్దుతున్నట్లు ఎంపీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గాంధీ హిల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ కేపీసీ గాంధీ, వైస్ చైర్మన్ జంధ్యాల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ దుర్గాదేవి అలంకరణలో కనకదుర్గమ్మ వారు



**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 30, మేజర్ న్యూస్ :** దేవదాయ ధర్మదాయ శాఖ, వారి ఉత్తర్వులు మేరకు యన్.టి. ఆర్. జిల్లా, జగ్గ య్యపేట మండ లం, ముక్త్యాల గ్రామములో పావన కృష్ణానది తీరమున వేంచేసియున్న శ్రీ భవానీ ముక్తేశ్వర స్వామి వారి దేవస్థాన ములో నిర్వహించబడు చున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తొమ్మిదవ రోజు మం గళవారం శ్రీ దుర్గా దేవి అలంకం ణలో అమ్మవారు దర్శనమిస్తున్నా రని, విచ్చేసిన భక్తు లందరికీ తీర్థ ప్రసాదములు పంపిణీ చేశారని, దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి. లక్ష్మణ ఇందిరాదత్తు వారి ప్రతినిధి, రాంప్రసాద్,, కార్యనిర్వహ ణాధికారి కానూరి సురేష్ బాబు తెలియజేసారు.


# విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు: ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999